పాఠం 7

# ద్రవ్యం - బ్యాంకింగ్

## డబ్బు లేకుండా వ్యాపారం

మోహన్ రాగులు తీసుకుని శ్యామల వద్ద మామిడిపళ్లు కొందామని వచ్చాడు. శ్యామల రాగులను రెండు సమకుప్పలుగా చేసింది. ఒక కుప్పలోని రాగుల బరువుకు సమానంగా మోహన్‌కి కొన్ని మామిడిపళ్లు ఇచ్చింది. మోహన్ మామిడిపళ్లను ఇంటికి తీసికెళ్లాడు, రెండు కుప్పల రాగులను శ్యామల ఉంచేసుకుంది. మామిడి పండ్ల మారక విలువ మొత్తం రాగులలో సగభాగం. 'ధాన్యంలో సగానికి' మామిడిపళ్ల మార్పిడి జరిగింది. ఇతర రకాలుగా కూడా మార్పిడి జరగవచ్చు. ఉదాహరణకు 'ధాన్యంతో సమానంగా'.

శ్రీకాకుళం జిల్లాలో కొన్ని గ్రామాలలో పిల్లలు బియ్యమిచ్చి వెదురుతో చేసిన బొమ్మలు తీసుకుంటారు.




ఈ రకంగా డబ్బులు లేకుండా ఒక వస్తువును ఇచ్చి మరొక వస్తువును తీసుకోవటాన్ని వస్తుమార్పిడి అంటారు.

కమ్మరివాళ్లు రైతులకు నాగలి కర్రులు, బండి చక్రాలు, కొడవళ్లు వంటివి తయారు చేసి ఇచ్చేవాళ్లు. అయితే ఈ పనులకు డబ్బు కాకుండా ప్రతి సంవత్సరం పంట వచ్చిన తరవాత కొంత ధాన్యం తీసుకునేవాళ్లు. ఒక బండికి లేదా ఒక నాగలి తయారీకి రైతు ఇంత చొప్పున ఇవ్వాలి అన్న అంగీకారం ఉండేది. డబ్బు అడగకుండ రైతులకు కావలసిన పనులను కమ్మరి చేసే సాంప్రదాయం కొనసాగుతుందని ప్రజలకు తెలుసు.

- డబ్బులు లేకుండా జరిగే మార్పిడులు ఏమైనా మీకు తెలుసా?
- పాతబట్టలు, ప్లాస్టిక్ సామాను, దిన పత్రికలు, వెంట్రుకలు, ధాన్యం ఇచ్చి ఏమైనా వస్తువులు మీరు కొని ఉండవచ్చు. ఈ లావాదేవీ ఎలా జరిగిందో చర్చించండి.

మరొక ఉదాహరణ తీసుకుందాం. రామయ్య దగ్గర బియ్యం ఉన్నాయి, అతడికి బంగాళదుంపలు కావాలి. రామయ్య బంగాళదుంపలు పండించే వీరయ్య దగ్గరకు వెళ్లాడు. వీరయ్యకు బియ్యం కావాలి, బంగాళదుంపలు ఇచ్చి బియ్యం తీసుకోటానికి అతడు సిద్ధంగా ఉన్నాడు. దాంతో ఇద్దరూ వస్తువులను మార్చుకున్నారు. వారిద్దరు తృప్తి చెందారు, దీనినే వస్తు మార్పిడి పద్ధతి అంటారు. ఈ రకమైన వస్తుమార్పిడిలో డబ్బు లేకుండానే వస్తువులను నేరుగా ఒకదానితో మరొకటి మార్చుకుంటారు.



మరొక ఉదాహరణలో గోపాల్ దగ్గర మేక ఉంది, అతడికి బియ్యం



కావాలి. గోపాల్ శీను దగ్గరకు వెళ్లాడు. అతడికి మేక కావాలి, కాని అతని దగ్గర బియ్యం కాక గోధుమలు ఉన్నాయి. బియ్యం పండించే రాముని గోపాల్ కలిశాడు. కానీ తన బియ్యానికి బదులుగా మేకని తీసుకోవాలని అతడికి లేదు, అతడికి గోధుమలు కావాలి.



- ఈ పట్టిక పూరించండి:

| | గోపాల్ | శీను | రాము |
|---|---|---|---|
| కొనాలని ఉంది | | | |
| అమ్మాలని ఉంది | | | |

- పై పట్టిక నుంచి మీరు ఏ నిర్ధారణకు వస్తారు?
- గోపాల్‌కు, శీనుకు మధ్య వస్తుమార్పిడికి ఎందుకు వీలుకాదో మీ సొంతమాటల్లో వివరించండి.
- డబ్బు వినియోగం దీనికి సహాయపడుతుందా?



ఖాళీలు పూరించండి.

గోపాల్ తన మేకను ............. ఇచ్చి ............. తీసుకుంటే అప్పుడు గోపాల్ ఈ డబ్బును ఉపయోగించి ............... నుంచి బియ్యం కొంటాడు. ఇప్పుడు ............. ఈ డబ్బుతో శీను నుంచి ............. కొంటాడు.

- గ్రామాలలో, పట్టణాలలో బట్టలు ఉతికేవాళ్లు, జుట్టు కత్తిరించేవాళ్లు, నీరటి (చెరువు నీటిని కావలి కాసేవారు) మొదలైన వారి పనికి తగిన వేతనం చెల్లిస్తారా? మీ తల్లిదండ్రులను అడిగి తెలుసుకోండి.

## డబ్బుతో మార్పిడి

డబ్బు వినియోగిస్తే సరుకుల మార్పిడిలో సమస్యలు ఉండవు. అప్పుడు ఏదైనా వస్తువులు అదనంగా ఉన్న వ్యక్తి వాటి అవసరం ఉండి, తనకు కావలసినవి ఉన్న వ్యక్తి కోసం వెతకాల్సిన పనిలేదు. డబ్బు మాధ్యమంగా పనిచేస్తుంది. ఈ మార్పిడికి డబ్బును వినియోగిస్తే ఆ డబ్బును మళ్లీ ఉపయోగించుకోవచ్చు. ఈ పరిస్థితిని పై ఉదాహరణల్లో చూశాం. డబ్బు అందరికీ ఆమోదయోగ్యం అయినప్పుడు ఇది సాధ్యమవుతుంది. అంటే ఏదైనా అమ్మేవాళ్లు తమ వస్తువులకు బదులుగా డబ్బు తీసుకుంటారు, ఏదైనా కొనాలనుకునే వాళ్లు అందుకు డబ్బు చెల్లిస్తే సరిపోతుంది. ఏ సరుకునైనా, సేవనైనా డబ్బు ఇచ్చి పొందవచ్చు. అంటే డబ్బును సరుకు, సేవలతో మార్చుకోవచ్చు. డబ్బుకి దానంతట దానికి ఎటువంటి ఉపయోగం ఉండకపోవచ్చు. మార్పిడిలో డబ్బు పోషించే పాత్రవల్ల అందరికీ డబ్బు కావాలి. డబ్బు రూపంలో అప్పు తీసుకుని, తిరిగి చెల్లించవచ్చు కూడా.

- గోపాల్, శీను, రాముల మధ్య లావాదేవీలో డబ్బు ఎలా ఉపయోగపడుతుంది? ఫ్లో చార్ట్ సహాయంతో వివరించండి.
- పైన వివరించిన విధంగా డబ్బు పాత్ర మార్పిడి మాధ్యమంగా పని చేయటం అంటే దానితో మీరు ఏకీభవిస్తారా? కారణాలతో వివరించండి.
- తన మేకను గోపాల్ ఎంత బియ్యంతో మార్చుకోవాలి?
- వస్తు మార్పిడి వ్యవస్థలో మీ జుట్టు కత్తిరించిన వ్యక్తికి ఎలా చెల్లిస్తారు? చర్చించండి.



వస్తుమార్పిడికి మరొక సమస్య ఉంది.

గోపాల్ : ఈ మేకకు ఎన్ని బస్తాల బియ్యం ఇస్తావు?

సీతయ్య : రెండు బస్తాలు.

గోపాల్ : పక్క ఊరిలో దీనికి 4 బస్తాలు ఇస్తామన్నారు.

సీతయ్య : వేరే ఊరిలో ఒక బస్తాకే నాకు మేక దొరుకుతుంది.

గోపాల్ : ...........................................

సీతయ్య : ...........................................

గోపాల్‌కు తన మేకకి 6 బస్తాల బియ్యం కావాలి. ఏ ధరకి వాటిని మార్చుకోవాలి? ఇంకో మాటలో చెప్పాలంటే బియ్యం లెక్కలో మేక విలువ ఎంత? వస్తు మార్పిడిలో ఒక వస్తువు విలువను మరొక వస్తు విలువతో నిర్ణయించాలి. అనేక సరుకులతో మార్పిడి చేయాల్సి ఉంటే, ఇది చాలా కష్టమవుతుంది. దీని వల్ల మార్పిడి, లేదా వ్యాపారం చాలా సంక్లిష్టం అవుతుంది. ఇది అంత వీలుగా ఉండదు. అందుకే ఇతర మార్పిడి విధానాలు ఏర్పడ్డాయి. వాటి గురించి తరవాత చదువుదాం. అయితే ఈనాటికీ, ప్రత్యేకించి పల్లెటూళ్లలో వస్తుమార్పిడిని ఇంకా ఉపయోగిస్తున్నారు.

- పైన ఇచ్చిన ఉదాహరణలో లావాదేవీ పూర్తయ్యేలా సంభాషణను పూర్తిచేయండి.
- మీరు, సంతలలో వ్యాపారస్తులు డబ్బు వినియోగించకపోతే ఏమవుతుంది? ఒక పేరాలో వివరించండి.
- సరుకులు, సేవల విలువను డబ్బుతో అంచనా వేయవచ్చా? వివరించండి.
- హరి టమాటాలు, బెండకాయలు, ఆకుకూరలు వంటి కూరగాయలు పండిస్తాడు. మూడు నెలల తరవాత అతడు ఎరువులు కొనుక్కోవాలి. కూరగాయలు ఇచ్చి ఎరువులు తీసుకోటానికి అప్పటిదాకా వాటిని నిలవ ఉంచలేడు. డబ్బు ఉపయోగించకపోతే ఎరువులు సరఫరా చేసే వ్యక్తితో హరి ఎటువంటి ఒప్పందం చేసుకుంటాడు? మీ చుట్టుపక్కల గ్రామాల్లో ఇటువంటి ఏర్పాట్లు ఇంకా ఉన్నాయా? ఇటువంటి ఏర్పాట్లు చాలాసార్లు రైతులకు లాభసాటిగా ఉండకపోవచ్చు. చర్చించండి.

గోపాల్ దగ్గర మేక ఉంది, అతడు అగ్గిపెట్టె కొనుక్కోవాలి. ఇది న్యాయమైన మార్పిడి అవుతుందా? మేకను విభజించలేడు కాబట్టి దాంట్లో కొంత భాగమిచ్చి అగ్గిపెట్టె తీసుకోలేడు. కానీ డబ్బుతో మీరు చిన్న చిన్న వస్తువులు కూడా కొనగలుగుతారు. డబ్బును విభజించవచ్చు - రూపాయలు, పైసలు ఉన్నాయి. కూరగాయల వంటి సరుకులు పాడైపోతాయి కాబట్టి వాటిని వెంటనే మార్చుకోవాలని మీకు తెలుసు. సరుకులను డబ్బుకి అమ్మటం ద్వారా ఇటువంటి సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. డబ్బు చాలా కాలం ఉంటుంది. భవిష్యత్తులో వినియోగానికి డబ్బును దాచుకోవచ్చు. గొర్రెలు, మేకలు, బియ్యం వంటి సరుకులు నిల్వ చేయటానికి చాలా చోటు కావాలి. అంతేకాకుండా మీ వస్తువులను మార్చుకోటానికి వాటిని బజారుకి బండి లేదా లారీలో తీసుకెళ్లాలి. అయితే డబ్బుకి అంత చోటు అవసరం ఉండదు. సంచి లేదా పర్సులో దానిని ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చు. అది రవాణాకి అనువైనది.

## పరిణామ క్రమంలో డబ్బు

ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు వస్తుమార్పిడి విధానాన్ని అవలంబించారు, దాంట్లో ఇబ్బందులను కూడా ఎదుర్కొన్నారు. వ్యాపారం విస్తరించినప్పుడు అనేక సరుకులను కొని, అమ్మేవారు. వాటిని దూరప్రాంతాలకు రవాణా కూడా చేసేవారు.





చిత్రం 7.1 : వివిధ కాలాల, రాజ్యాల నాటి నాణాలు

ఇటువంటి పరిస్థితుల్లో అన్ని సమాజాలలో ఏదో ఒక రూపంలో డబ్బు చెలామణిలోకి వచ్చింది. ఉదాహరణకు చాలా పురాతన కాలంలో ధాన్యం, పశువులను సంపదగా ఉపయోగించేవారు. అయితే వీటి నిల్వ, రవాణాలు కష్టంగా ఉండేవి. వాటికి రోగాలు వంటివి సోకే అవకాశం ఉంది కాబట్టి వాటి మన్నిక కూడా సమస్యగా ఉండేది.

కాలక్రమంలో అరుదైన, ఆకర్షణీయమైన లోహాలను మార్పిడి మాధ్యమంగా ప్రజలు ఉపయోగించటం మొదలుపెట్టారు. రాగి, ఇత్తడి, వెండి, బంగారం వంటివి పాడవ్వకుండా చాలా కాలం ఉంటాయి, చిన్న భాగాలుగా చేయవచ్చు, తేలికగా రవాణా చేయవచ్చు. ఇది కొరత వస్తువు కాబట్టి అందరూ దీనిని ఆమోదిస్తారు. ప్రజలు తమ చేతిలో ఉన్న డబ్బు విలువైనదని, ఇతరులు కోరుకొనేది అనే నమ్మకంతో అమ్మడం, కొనడం చేసేవారు. ఈ డబ్బుకి విలువ ఉందని, ఇతరులు దానిని ఆమోదిస్తారని ప్రజలకు తెలుసు కాబట్టి తమ సరుకులను డబ్బుకి అమ్ముకునేవారు. ధాన్యం, పశువుల విలువ పడిపోయినట్టు డబ్బు విలువ పడిపోతుందని వాళ్లు భయపడాల్సిన అవసరం లేదు. అయితే వస్తు మార్పిడిలోని అన్ని సమస్యలు ఈ రకమైన డబ్బు వల్ల పరిష్కారం కాలేదు, కొత్త సమస్యలు కూడా వచ్చాయి. లోహాలతో మార్పిడి చేసేటప్పుడు ప్రతిసారీ దానిని తూకం వేయాల్సి వచ్చేది. తరవాత లోహాల నాణ్యత పట్ల వ్యాపారస్తులకు అనుమానం కలిగేది. మార్పిడిలో స్వచ్ఛమైన వెండి, బంగారం లభించకపోవచ్చు. కొంతకాలం తరవాత మార్పిడికి ఉపయోగించిన లోహ నాణ్యతలో నమ్మకం పెద్ద సమస్యగా మారింది.



ఈ పరిస్థితులలో కొంతమంది రాజులు పైన పేర్కొన్న సమస్యలను కొన్నింటిని పరిష్కరిస్తూ వాళ్లకి అనుకూలమైన విధానాలను రూపొందించారు. ప్రామాణికమైన ఆకారం, బరువు, నాణ్యతలు కలిగిన నాణాలను రాజుగారి టంకశాలలో తయారు చేయటం మొదలయింది. ప్రతిసారీ వీటిని తూకం వేయాల్సిన పనిలేదు, నాణ్యతకు సంబంధించి భరోసా ఏర్పడింది, వాటిని తీసుకెళ్లటం తేలిక. రోమన్ల కాలంలో 'బీసెంట్' అనే బంగారు నాణెం ప్రామాణికంగా ఉండేది, మౌర్యుల కాలంలో 'పాణా' అనే వెండి నాణెం ప్రామాణికంగా ఉండేది. వ్యాపారస్తులు, ప్రజలు నాణాలను డబ్బు రూపంగా ఆమోదించసాగారు.

- డబ్బుగా లోహాలను ఎందుకు ఎంచుకున్నారు?
- నాణాలను ముద్రించటం మంచి ఆలోచనేనా?
- నాణాలను ముద్రించటం వల్ల పాలకులకు ఎటువంటి ప్రయోజనం ఉంటుంది? మూడు వివిధ కారణాలను పేర్కొనండి.

## కాగితం డబ్బు, బ్యాంకుల ఆవిర్భావం

పెద్ద మొత్తంలో సరుకులు కొని, అమ్మేవాళ్లు ఈ లావాదేవీల కోసం పెద్ద మొత్తంలో వెండి, బంగారు నాణాలను జాగ్రత్తపరిచే ప్రదేశాల కోసం వెదకటం మొదలు పెట్టారు. వారు డబ్బుకు రక్షణ కల్పించే స్వర్ణకారుల దగ్గరకు వెళ్ళారు. స్వర్ణకారుడు తగిన రుసుము తీసుకొని వాటిని భద్రపరిచి వారు కోరినప్పుడు వాటిని అందుబాటులో ఉంచేవాడు. ఈ విధానం ప్రాచుర్యం పొందినది. స్వర్ణకారుల మీద, షరాఫ్ (అకౌంటెంట్) మీద నమ్మకం పెరిగింది. స్వర్ణకారులు రుణాలను కూడా ఇచ్చేవారు. వీరికి అనేక

ప్రసిద్ధిచెందిన పట్టణాలలో శాఖలు ఉండేవి. ఈ విధానం "కాగితపు డబ్బు" లేదా హుండీలనే కొత్త విధానానికి దారి తీసింది. ఉదాహరణకు సోము విజయవాడకు చెందిన బట్టల వ్యాపారి. హైద్రాబాద్‌లోని చందు దగ్గర యంత్రాలను కొనడానికి వెళ్ళాలి. హైద్రాబాద్‌లో చెల్లించడానికి బంగారు నాణాలు తీసుకెళ్ళడం ప్రమాదం కాబట్టి తన పది బంగారు నాణాలను స్వర్ణకారుడి వద్ద ఉంచి అతని వద్ద నుండి తన పేరుతో ఒక రశీదును పొందాడు. నేను 10 బంగారు నాణాలను చెల్లిస్తానని ప్రమాణం చేస్తున్నాను అని ఆ రశీదు చెబుతుంది. ఇప్పుడు చందూ నుంచి సోము యంత్రాలు కొన్నాడు. స్వర్ణకారుడు ఇచ్చిన రశీదుని చందుకి ఇచ్చి వాళ్ల శాఖనుంచి పది నాణాలు తీసుకొమ్మని సోము చెప్పాడు. ఆ శాఖకు ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్లి 10 నాణాలు తీసుకోవచ్చని చందుకి తెలుసు. అయితే అతడు నాణాలు తీసుకోటానికి వెళ్లలేదు. ఇనుము, ఉక్కు అమ్మే సయ్యద్ దగ్గరకు వెళ్లి వాటిని కొనుక్కున్నాడు, అందుకు బదులుగా సోము ఇచ్చిన పది నాణాల రశీదు ఇచ్చాడు. ఆ స్వర్ణకారుడి నుంచి పది నాణాలు తీసుకొమ్మని సయ్యద్‌కి చెప్పాడు. ఆ స్వర్ణకారుడు అందరికీ తెలుసు కాబట్టి, రశీదు చూపించిన వాళ్లకి నాణాలు ఇస్తాడన్న నమ్మకం ఉంది కాబట్టి సయ్యద్ ఎటువంటి అభ్యంతరాలు పెట్టకుండా ఆ రశీదును తీసుకున్నాడు. సోము మొదటగా తీసుకున్న రశీదు ఆర్థిక వ్యవస్థలో ఒకరినుంచి మరొకరికి చెలామణి అవుతూ, చెల్లింపులకు మాధ్యమంగా అందరి అంగీకారం పొందింది. ఇటువంటి రశీదులకు ఉన్న నమ్మకం కారణంగా కొత్తరకం డబ్బుగా పని చేస్తుంది.

### ప్లాస్టిక్ లేదా పాలిమర్ బ్యాంక్ నోట్లు

కాగితపు నోట్లకు కూడా కొన్ని లోపాలు ఉన్నాయి. అది మురికి అవుతుంది, చిరిగిపోతుంది. దాంతో నోట్లకు ప్లాస్టిక్‌ను ఉపయోగించాలన్న భావన ఏర్పడింది. ప్లాస్టిక్ లేదా పాలిమర్ నోట్లు పాడవ్వకుండా చాలా కాలం మన్నుతాయి. వీటిలో నకిలీ నోట్లను కూడా తేలికగా గుర్తించవచ్చు. ఇది నీటికి తడవదు, పర్యావరణానికి హాని చెయ్యదు (దీంతో తిరిగి నోట్లు తయారు చేయవచ్చు). లోహాల వాడకం నుండి కాగితపు డబ్బు వాడకం, కాగితపు డబ్బు నుండి ప్లాస్టిక్ డబ్బు వాడకంలోకి రావచ్చు. డబ్బుకు వాడే పదార్థాల వల్ల దాని విలువ ప్రభావితం అవుతుందని భావిస్తున్నారా?



*చిత్రం 7.2 : భారతదేశంలో డబ్బును ముద్రించి పంపిణీ చేసే బాధ్యత భారతీయ రిజర్వు బ్యాంక్‌ది*

భారతదేశంలో తొలి బ్యాంకర్లు అయిన బెంగాల్‌కి చెందిన జగత్‌సేఠ్‌లు, పాట్నాకి చెందిన షా, సూరత్‌కి చెందిన అరుణ్‌జీనాథ్‌జీ, మద్రాసుకి చెందిన చెట్టియార్ మొదలైన వారు ఎంతో డబ్బును, పరపతిని అనుభవించారు. వారి రశీదులను, హుండీలనే కాగితపు డబ్బులను దేశమంతటా, విదేశాలలో కూడా అంగీకరించేవారు.

బ్యాంకులు ఆవిర్భవించటానికి మరొక భిన్న కథనాన్ని చూద్దాం. 1606లో యూరవులో ఆమ్‌స్టర్‌డాం ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉండేది. ఇక్కడ మార్పిడికి ప్రభుత్వం ఆమోదించిన 846 రకాల బంగారు, వెండి నాణాలు ఉండేవి. అయితే వ్యాపారస్తులు ఒకరినొకరు అనుమానిస్తూ ఉండే వాళ్లు – ఈ నాణాల బరువు, నాణ్యతల పట్ల ఎవరికీ నమ్మకం ఉండేది కాదు. ఆమ్‌స్టర్‌డాం వర్తకులందరూ సమావేశమై ఈ సమస్యకు ప్రత్యేక పరిష్కారాన్ని కనుగొన్నారు. ఆ నగర యాజమాన్యంలో ఉండే ఒక బ్యాంకును వాళ్లు స్థాపించారు. ఒక వర్తకుడు తన నాణాలను బ్యాంకుకు తీసుకెళ్లి ఇస్తే బ్యాంకు అతడు



ఇచ్చిన నాణాల బరువు తూచి, నాణ్యతను పరిశీలించి ఒక రశీదు ఇచ్చి అతని పేరున ఒక ఖాతా తెరుస్తుంది. ఆ వ్యాపారి తనకు కావలసినప్పుడు స్వచ్ఛమైన బంగారం పొందవచ్చు, అవసరమైతే దీంట్లో కొంత మొత్తం ఇంకొక వ్యక్తికి బదిలీ చేయవచ్చు. ఇది వర్తకులకు సౌకర్యంగా మారింది.

బ్యాంకు నిజాయితీగా పని చేసేది, దానిని వ్యాపారస్తులందరూ నమ్మేవాళ్లు. నాణాలకు బదులు బ్యాంకు రశీదులను అడిగేవారు, లేదా తమ ఖాతాలో బదిలీ చేయమనేవాళ్లు. అడిగినప్పుడు బ్యాంకు తమకు స్వచ్ఛమైన బంగారం ఇస్తుందని వ్యాపారస్తులకు నమ్మకం ఉండేది. బ్యాంకులో జమచేసిన మొత్తం కొత్త రకం డబ్బుగా మారింది. ఈ బ్యాంకు వ్యాపారం పెరిగి అది రెండు శతాబ్దాలపాటు విజయవంతంగా పనిచేసింది.

- స్వర్ణకారులు ఇచ్చిన రశీదులు డబ్బుగా ఎందుకు పని చేస్తాయి?
- స్వర్ణకారులపై నమ్మకం విఫలమయ్యే సందర్భాలు ఏమిటి?
- ఆమ్‌స్టర్‌డాంలో వర్తకులు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నారు? వాటికి వాళ్లు ఏ పరిష్కారం కనుగొన్నారు?
- రెండు శతాబ్దాల తరవాత ఈ బ్యాంకు కుప్పకూలిపోయింది. దానికి కారణాలు ఏమై ఉంటాయి? చర్చించండి.
- ప్రస్తుత కాలంలో రూపాయల నోట్ల మీద ఉండే హామీని చదవండి. ఎవరు హామీ ఇస్తున్నారు? ఎవరికి? ఇది ఎందుకు ముఖ్యం? చర్చించండి.

## బ్యాంకింగ్

### ఆధునిక బ్యాంకులు

- మీరు ఎప్పుడైనా బ్యాంకు లోపలకు వెళ్లారా? మీకు తెలిసిన కొన్ని బ్యాంకుల పేర్లు చెప్పండి.
- మీరు బ్యాంకు లోపలికి వెళితే వివిధ కౌంటర్ల దగ్గర ఖాతాపుస్తకాలు/ కంప్యూటర్ల సహాయంతో ఖాతాదారులతో వ్యవహరించే ఉద్యోగస్తులు కనవడతారు. కొన్ని కౌంటర్ల దగ్గర ఖాతాదారులు డబ్బులు జమ చేయటం, కొన్నింటి దగ్గర డబ్బు తీసుకోవటం కూడా చూసి ఉంటారు. ఒక క్యాబిన్‌లో బ్యాంకు మేనేజరు కూర్చుని ఉంటారు. ఈ బ్యాంకు ఉద్యోగస్తులు ఏం చేస్తారు?

### వాణిజ్య బ్యాంకులు

వాణిజ్య లావాదేవీలను నిర్వహించేది బ్యాంకింగ్. దీంట్లో ప్రజల దగ్గరనుంచి డబ్బు జమ చేసుకుంటారు. ఈ డబ్బును ఒక వ్యక్తినుంచి మరొక వ్యక్తికి బదిలీ చేయవచ్చు. వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు, రైతులు, వ్యక్తులకు బ్యాంకులు అప్పులు కూడా ఇస్తాయి. ఇటువంటి బ్యాంకులను వాణిజ్య బ్యాంకులు అంటారు. ఈ రెండు రకాల అంశాలను పరిశీలిద్దాం.

### డబ్బు జమ

ప్రజలు బ్యాంకులలో దాచుకునే డబ్బును జమ అంటారు. బ్యాంకులో డబ్బు జమ చేయటంలో అనేక విధానాలు ఉన్నాయి. వీటిల్లో కొన్నింటి గురించి ఇక్కడ తెలుసుకుందాం.

### పొదుపు ఖాతాలు, జమలు:

గీత తన జీతంలోంచి 5000 రూపాయలు పొదుపు చేసింది, ఆ మొత్తాన్ని భద్రంగా దాచాలని అనుకుంది. ఆమె తన ఇంటికి దగ్గరగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు శాఖకు వెళ్లి అక్కడ ఒక పొదుపు ఖాతా తెరిచింది. ఆ డబ్బుపై ఆమెకు కొంత వడ్డీ వస్తుంది. డబ్బు క్షేమంగా ఉంటుంది. అన్నింటికన్నా ముఖ్యమైనది ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆమె తన డబ్బు తీసుకోవచ్చు. అడిగినప్పుడు డబ్బు చెల్లిస్తానన్న హామీ బ్యాంకు ఇస్తుంది.





### బ్యాంకులోనే డబ్బును ఎందుకు పొదుపు చేయాలి?

- ద్రవ్యంను ఇంటిలో దాచుకున్నట్లయితే ఎలాంటి వడ్డీ లభించదు. అదే బ్యాంకు ఖాతాలో దాచుకున్నట్లయితే మన డబ్బుకు వడ్డీ లభించి ద్రవ్యంలో పెరుగుదల కనిపిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజల ఆదాయాలు క్రమంగా ఉండకపోవడమేగాక, వీరి ఆదాయాలను సరిగ్గా అంచనా కూడా వేయలేం. అదేవిధంగా, పంటలు సరిగ్గా పండని కాలంలో, ఉపాధి దొరకని సమయంలో, కుటుంబంలో అనుకోని మరణాలు సంభవించినప్పుడు, పెళ్లిళ్లకోసం, పండుగల సమయాల్లో ప్రజలు డబ్బు కోసం ఇబ్బందులకు గురి అవుతారు. ఇలాంటి పరిస్థితులలో బ్యాంక్ ఖాతాలో ముందుచూపుగా దాచుకున్న డబ్బు వారి అవసరాలకు పనికి వస్తుంది. అంతేకాకుండా బ్యాంకులో డబ్బుకు రక్షణ ఉంటుంది.

**తెలుసుకోండి**

- గీత ఎటిఎంకి వెళ్లి డబ్బు ఎలా తీసుకోవచ్చు?
- ఆమె తన ఖాతా ఉన్న బ్యాంకుకి వెళితే ఏమి చేస్తుంది?





*చిత్రం 7.3 : బ్యాంక్‌లో జమలు, చెల్లింపులు జరిగే ప్రదేశం*

### బేసిక్ సేవింగ్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్ (BSBDA):

బ్యాంకులో ఎటువంటి నగదు నిల్వలు అవసరం లేకుండా ఉచితంగా ఖాతా తెరవవచ్చు. ఒక నెలలో ఎన్నిసార్లయినా ఈ ఖాతాలలో డిపాజిట్లను జరపవచ్చు. అదేవిధంగా ATM తో సహా గరిష్ఠంగా నాలుగుసార్లు నగదును ఉపసంహరించుకోవచ్చు.

### చెక్కులు

ప్రస్తుతం డబ్బులు చెల్లించటానికి, తీసుకోటానికి చెక్కులను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఎవరికైనా డబ్బులు ఇవ్వాలంటే ఆ వ్యక్తి పేరుతో చెక్కు ఇస్తారు. వేరే ఊళ్లో ఉన్న వ్యక్తికి డబ్బు పంపించాలంటే ఆమె పేరుమీద చెక్కు రాసి దానిని పోస్టులో పంపించవచ్చు. బ్యాంకు ద్వారా మరొకరి ఖాతాలోకి డబ్బుని బదిలీ చేయటానికి కూడా చెక్కును ఉపయోగించవచ్చు. వ్యాపారాలలో డబ్బులు తీసుకోవటం, చెల్లించటానికి సంబంధించి అనేక లావాదేవీలు ఉంటాయి, ఈ లావాదేవీలలో మాధ్యమంగా చెక్కులు ముఖ్యపాత్ర పోషిస్తాయి.




*చిత్రం 7.4 : మాదిరి చెక్కు*



చెక్కు ఎలా రాయాలో ఉదాహరణ (పేజి 83) చూడండి.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైద్రాబాద్‌లో సురేష్ ఒక ఖాతాదారుడు. అతడు కంచర్ల సుజాతకు రూ. 1,75,000 లు చెల్లించాలి. అతడు కంచర్ల సుజాత పేరు మీద క్రాస్ చెక్కు ఇస్తాడు.

- మీ నోట్ పుస్తకంలో బ్యాంక్ చెక్కు చిత్రాన్ని గీసి మీ పక్కన కూర్చున్న స్నేహితుని పేరు మీద 1,50,000 రూపాయలకు ఒక చెక్కు రాయండి.
- క్రాస్ చేసిన చెక్కు ఇవ్వటం ఎందుకు మంచిది? చర్చించండి.
- కంచర్ల సుజాత ఖాతాకు సురేష్ 1,75,000 రూపాయలను డిపాజిట్ చేయాలి. అది ఎలా జరుగుతుంది? బ్యాంక్‌ను సందర్శించి వివరాలు రాయండి.
- చెక్కు ఉపయోగించకుండా బ్యాంకు ద్వారా నేరుగా ఏఏ చెల్లింపులు చేస్తారో చర్చించి, వాటి జాబితా తయారు చేయండి.

### కరెంటు ఖాతా జమలు

చాలామంది వ్యాపారవేత్తలు, దుకాణదారులు, కంపెనీలకు రోజువారీ ఆదాయం, ఖర్చులు పెద్ద మొత్తంలో ఉంటాయి. సరుకులు కొనటం, వేతనాలు చెల్లించటం వంటి వాటి కోసం అనేకమార్లు బ్యాంకు నుంచి డబ్బు తీసుకోవలసి ఉంటుంది. అదేవిధంగా పెద్ద పెద్ద వ్యాపార సంస్థలకు తమ సరుకులు, సేవలు కొనుగోలు చేసేవాళ్లనుంచి రోజూ డబ్బులొస్తాయి, తమకు వివిధ వస్తువులు సరఫరా చేసిన వాళ్లకు, పనులు చేసిన వాళ్లకు చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ఈ రకమైన డబ్బు అవసరాలకు బ్యాంకులు కరెంటు ఖాతా అనే ప్రత్యేక ఖాతాలను కలిగి ఉంటాయి. కరెంటు ఖాతా నుంచి ఎన్నిసార్లయినా డబ్బులు తీసుకోవచ్చు, జమ చేయవచ్చు, వీటిపై పరిమితి ఏదీ లేదు. చెక్కు ద్వారా లావాదేవీలు చేపట్టవచ్చు కాబట్టి పెద్ద మొత్తంలో నగదుతో వ్యవహరించాల్సిన ప్రమాదం ఉండదు. అయితే కరెంటు ఖాతాలో ఉన్న మొత్తంపై బ్యాంకు ఎటువంటి వడ్డీ చెల్లించదు, అదనంగా సేవా రుసుము వసూలు చేస్తుంది.

- పొదుపు, కరెంటు ఖాతాల మధ్య తేడాలేమిటి?

### బ్యాంకు వ్యవస్థ ఎలా పని చేస్తుంది?

ఒక బ్యాంకు ఖాతాలో జమచేసిన చెక్కు ద్వారా ఇంకొక ఖాతాలోకి డబ్బు బదిలీ చేయవచ్చు. బ్యాంకింగ్ వ్యవస్థ నిర్వహించే ఈ విధానం వల్ల బ్యాంకులో చేసిన జమ డబ్బులాగా పనిచేస్తుంది. అంటే బ్యాంకు జమలు డబ్బుతో సమానం.

అనేక పట్టణాలు, నగరాల్లో అన్ని బ్యాంకుల ప్రతినిధులు ప్రతిరోజూ సమావేశమై ఆ రోజు ప్రతి బ్యాంకుకీ ఇతర బ్యాంకుల నుంచి రావలసిన మొత్తాలను, అలాగే ఇతర బ్యాంకులకు చెల్లించాల్సిన మొత్తాలను నిర్ధారించుకుంటారు. సరిచూసిన చెక్కులు ఒకరికొకరు మార్చుకుంటారు. ఒక బ్యాంకు 'క్లియరింగ్ బ్యాంకు'గా పని చేస్తుంది, ఆ బ్యాంకులో మిగిలిన బ్యాంకులన్నింటికీ ఖాతాలు ఉంటాయి. బ్యాంకుల మధ్య వసూళ్లు, చెల్లింపులను ఈ క్లియరింగ్ బ్యాంకు నిర్వహిస్తుంది.

కొత్త విధానంలో అన్ని బ్యాంకులు, వాటి అన్ని శాఖలూ కంప్యూటర్ల ద్వారా అనుసంధానమై ఉన్నాయి. అన్ని బ్యాంకు ఖాతాలను, వారి సంతకాలను ఎక్కడ ఉన్న శాఖలోనైనా సరిచూసుకోవచ్చు. కాబట్టి బ్యాంకు ప్రతినిధులు కలవాల్సిన పనిలేదు, అదే విధంగా వేరే ఊళ్లో ఉన్న శాఖలకు బ్యాంకులు చెక్కులు పంపించాల్సిన అవసరం లేదు. ఒక బ్యాంకు మరొక బ్యాంకు మధ్య లావాదేవీలను అనుసంధానం చేయబడిన కంప్యూటర్ల ద్వారా నిర్వహిస్తారు. దీని వల్ల పనులు చాలా తేలికగానే కాకుండా చాలా తొందరగా కూడా పూర్తవుతాయి.





© SCERT not to be republished

## ఇంటర్నెట్ బ్యాంకింగ్



చిత్రం 7.5 : ఎటిఎమ్ నుండి డబ్బు తీసుకుంటున్న వ్యక్తి

ప్రస్తుతం కంప్యూటర్లు, ఇంటర్నెట్‌లను అంతటా వాడుతున్నారు. అనేక బ్యాంకులలో ఉద్యోగులు, యంత్రాలు నిర్వహించే టెల్లర్ కౌంటర్ల స్థానాన్ని **'ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్లు'** (ఎటిఎంలు) తీసుకుంటున్నాయి. బ్యాంకింగ్ కార్యకలాపాలను ఇంటర్నెట్ ఉన్న కంప్యూటర్లతోనూ, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలతోనూ నిర్వహిస్తున్నారు. దీనినే ఎలక్ట్రానిక్ లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్ అంటున్నారు. అనేక బ్యాంకులు డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్, ఫోన్ బ్యాంకింగ్ వంటి వాటి ద్వారా తమ ఖాతాదారులకు ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నాయి.

చిత్రం 7.6 : కింది చిత్రం ద్వారా డబ్బులు చెల్లించడం కోసం మొబైల్ నంబరును నమోదు చేసుకొనటం గమనించవచ్చు



ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా ఒక వ్యక్తి తన బ్యాంకు ఖాతానుంచి మరొక వ్యక్తికి చెందిన మరొక బ్యాంకు ఖాతాకు డబ్బులు బదిలీ చేయవచ్చు, వస్తువులు కొనవచ్చు, అమ్మవచ్చు, పెట్టుబడులు పెట్టవచ్చు, అప్పులు తిరిగి చెల్లించవచ్చు, కరెంటు, ఫోను వంటి ఇతర బిల్లులు చెల్లించవచ్చు.

ఇంటర్నెట్ బ్యాంకింగ్ వల్ల ఖాతాదారునికి తన బ్యాంకుకు వెళ్లవలసిన పని, కాగితాలు నింపవలసిన పని వంటి ఇబ్బందులు తప్పుతాయి. ఒక క్లిక్ ద్వారా ఎవరైనా వారి డబ్బును బదిలీ చేయడం, బిల్లులు చెల్లించడం లాంటివి సులభంగా చేయవచ్చు. పని ఎక్కువగా ఉన్నవారు ఇంటర్‌నెట్ బ్యాంక్‌కు ప్రాధాన్యత ఇస్తారు. రఘుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సికింద్రాబాద్ శాఖలో ఖాతా ఉంది. అతను ఆన్‌లైన్ బ్యాంకింగ్‌కై పేరు నమోదు చేసుకున్నాడు. రఘు తన ఫోన్ బిల్లు చెల్లించటానికి ఎస్‌బిఐ బ్యాంకు వెబ్‌సైట్‌లోకి తన యూజర్ పేరు, పాస్‌వర్డ్ ఉపయోగించి ప్రవేశిస్తాడు. అందులో ఆన్‌లైన్ ద్వారా ఫోన్ బిల్లు చెల్లింపు అన్న దానిని ఎంచుకుంటాడు, తన ఫోను నంబరు, చెల్లించాల్సిన మొత్తాన్ని టైప్ చేస్తాడు. ఆ మొత్తం అతని ఎస్‌బిఐ ఖాతాలో తగ్గించబడి, ఇన్‌వాయిస్ తయారవుతుంది. ఆన్‌లైన్ సేవల ద్వారా బిల్లులు చెల్లించటం వల్ల సమయం, శ్రమ ఆదా అవుతాయి, అంతేకాకుండా సకాలంలో బిల్లులు చెల్లించవచ్చు.



- వరస ఎలో ఉన్న వాటిని వరస బిలోని వాటితో జతపరచండి


| వరస ఎ | | వరస బి |
|---|---|---|
| (అ) మనం నగదు తీసుకువెళ్లాల్సిన అవసరం లేకుండా మన ఖాతాలోంచి చెల్లింపులు చేయటానికి వీలు కల్పించే బ్యాంకింగ్ సౌకర్యం | ( ) | (i) ఎటిఎం |
| (ఆ) రోజులో 24 గంటలలో ఎప్పుడైనా డబ్బులు జమ చేయటానికి, తీసుకోటానికి వీలు కల్పించే బ్యాంకింగ్ సౌకర్యం | ( ) | (ii) ఫోన్ బ్యాంకింగ్ |
| (ఇ) ఇంటర్నెట్ ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించటానికి సహాయం చేసే సౌకర్యం | ( ) | (iii) క్రెడిట్ కార్డ్ |
| (ఈ) ఈ సౌకర్యం ఉపయోగించి మొబైల్ ఫోను ద్వారా మన ఖాతాలో ఎంత సొమ్ము ఉందో తెలుసుకోవచ్చు | ( ) | (iv) డెబిట్ కార్డ్ |
| (ఉ) ఈ సౌకర్యం ఉపయోగించి రకరకాల చెల్లింపులు చేయవచ్చు | ( ) | (v) నెట్ బ్యాంకింగ్ |

## ఫిక్స్‌డ్ డిపాజిట్లు

మనస్విని వాళ్ల తాతయ్య ఆమెకు ఒక బహుమతి ఇవ్వాలని అనుకున్నాడు. అతడు ఆమెకు పదివేల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్టు పత్రం ఇచ్చాడు. "అయిదు సంవత్సరాల తరవాత నీ కళాశాల ప్రవేశానికి సరిపోయేటంతగా ఈ మొత్తం పెరుగుతుంది," అని తాతయ్య చెప్పాడు. ఆ డబ్బు ఎలా పెరుగుతుంది?

ఫిక్స్‌డ్ డిపాజిట్టు లేదా టర్మ్ డిపాజిట్టు అన్న దానిని అది వేసిన కాలంలోపు డబ్బు తీసుకోటానికి లేదు, అది ఒక సంవత్సరం, రెండు సంవత్సరాలు, అయిదు లేదా ఏడు సంవత్సరాలు కావచ్చు. ఫిక్స్‌డ్ డిపాజిట్టుపై ఎక్కువ వడ్డీ లభిస్తుంది.

- పొదుపు కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్టును ఎప్పుడు ఎంచుకోవాలి?
- వడ్డీ 8 శాతం అయితే, 5 సంవత్సరాల తరవాత మనస్వినికి ఎంత డబ్బు వస్తుంది?
- వైద్య ఖర్చుల కోసం ఆమెకు అత్యవసరంగా డబ్బులు అవసరమయ్యాయని అనుకుందాం. బ్యాంకులో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్టు నుంచి ఆ మొత్తాన్ని ఆమె తీసుకోవచ్చా? ఏమవుతుంది?




చిత్రం 7.7 : బ్యాంక్ పనిచేసే విధానం



© SCERT not to be republished

## అప్పులు

బ్యాంకు అనేది ఒక వాణిజ్య సంస్థ. డబ్బులు జమ చేసిన వారికి అది వడ్డీ ఇవ్వాలి, ఉద్యోగస్తులకు జీతాలు ఇవ్వాలి, పరికరాలు కొని, నిర్వహించాలి, అద్దెలు చెల్లించాలి, బ్యాంకు నడపటానికి అయ్యే ఇతర ఖర్చులు భరించాలి. అంతిమంగా లాభాలు సంపాదించాలి. మరి దానికి ఆదాయం ఎలా వస్తుంది?

ప్రజలు పొదుపు చేసిన డబ్బు జమల రూపంలో బ్యాంకులోకి వస్తుంది. అడిగినప్పుడు తమ డబ్బు తమకు లభిస్తుందన్న నమ్మకం ఉన్నంతవరకు డబ్బు జమ చేసినవాళ్లు దానిని తిరిగి తీసేసుకోవాలని అనుకోరు. చాలా మంది నెల మొదట్లో డబ్బు తీసుకుంటారు. డబ్బులు జమ చేసింది రైతులు అయితే వాళ్లకు కొన్ని ప్రత్యేక సమయాల్లో (వానా కాలంలో) డబ్బులు అవసరమవుతాయి. తమ వద్ద జమ అయిన డబ్బులో కొంత మొత్తమే నగదుగా పెట్టుకుంటే అడిగిన వాళ్లందరికీ డబ్బులు ఇవ్వవచ్చని అనుభవం మీద బ్యాంకులు గ్రహించాయి. కావలసినప్పుడు డబ్బులు తీసుకోగలిగి, తమ ఖాతాలోని డబ్బుని చెల్లింపులకు ఉపయోగించుకోగలిగినంత కాలం బ్యాంకులపై ప్రజల నమ్మకం కొనసాగుతుంటుంది.

ఇంకొక వైపున బ్యాంకులు ప్రజలకు అప్పులు ఇస్తాయి. ఈ అప్పులను వాళ్లు వడ్డీతో తిరిగి ఇస్తారు. బ్యాంకులు ప్రభుత్వానికి కూడా అప్పులిచ్చి కొంత వడ్డీ పొందుతాయి. బ్యాంకులు ఇచ్చిన అప్పుపై వచ్చే వడ్డీ వాటి ఆదాయమవుతుంది.

- బ్యాంకు నుంచి అప్పు తీసుకునే వాళ్లందరి నుంచి ఒకే రకమైన వడ్డీ వసూలు చేస్తారా?
- అప్పు తీసుకున్నవాళ్లు ఎవరైనా తిరిగి బ్యాంకుకు చెల్లించకపోతే ఏమవుతుంది?

## అప్పుల రకాలు

వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు (విద్యా ఋణాలు), రైతులు, చేతివృత్తుదారులు వంటి అనేకమందికి బ్యాంకులు అప్పులిస్తాయి. వీటిల్లో కొన్నింటిని చూద్దాం.

*రహీం చిన్న రైతు. అతడికున్న 4 ఎకరాల భూమిలో వరి పండిస్తాడు. నారుమడి సమయంలో విత్తనాలకు, ఎరువులకు అతడికి డబ్బు అవసరం అయ్యింది. అతడు 10,000 రూపాయల అప్పు చేశాడు. అతడు తన పంటను తాకట్టు పెట్టాడు (హామీగా చూపించాడు). పంట అమ్మిన తరవాత సంవత్సరంలోపే రహీం తన అప్పు తీర్చేస్తాడు.*

*లీల ఒక ఫ్లాటు కొనుక్కోవాలని అనుకుంది. ఆ ఫ్లాటు తాకట్టు పెట్టి బ్యాంకునుండి 8 లక్షల రూపాయల గృహ రుణం తీసుకుంది. నెలనెలా ఆమె జీతం నుంచి కొంత మొత్తాన్ని వాయిదా కింద బ్యాంకుకి జమ చేస్తుంది. బ్యాంకు అప్పు మొత్తం తీర్చిన తరవాతనే ఫ్లాటుకి సంబంధించిన పత్రాలు ఆమె చేతికి అందుతాయి.*

*శాంత స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జి)లో సభ్యురాలు. ఆమె ఇంటి మరమ్మతు కోసం బ్యాంకునుంచి అప్పు తీసుకుంది. ఆమె హామీ కింద ఎటువంటి ఆస్తులు చూపించాల్సిన అవసరం లేదు. తమ సభ్యులు అప్పులు తిరిగి చెల్లించేలా చూసే బాధ్యత సంఘం తీసుకుంటుంది.*



చిత్రం 7.8 : ఎస్.హెచ్.జి సభ్యుల సమావేశం

రకరకాల వ్యక్తులు, రకరకాల అవసరాల కోసం బ్యాంకు నియమ, నిబంధనలకు లోబడి అప్పులు తీసుకోవచ్చు. వడ్డీ శాతం, హామీ, ఇవ్వాల్సిన పత్రాలు, తిరిగి చెల్లించే విధానం వంటివన్నీ ఈ రుణ షరతులలో భాగంగా ఉంటాయి.



- బ్యాంకులు అప్పు ఇచ్చేటప్పుడు హామీ ఎందుకు తీసుకుంటాయి?
- అప్పు తీసుకోటానికి బ్యాంకులు మంచివా, వడ్డీ వ్యాపారస్తులా? ఎందుకు?
- వ్యక్తిగతంగా తీసుకునే అప్పుకు, స్వయం సహాయక సంఘంగా తీసుకునే అప్పుకు తేడా ఏమిటి?

**మీ ప్రాంతంలో ఉన్న వాణిజ్య బ్యాంకును సందర్శించి ఈ పట్టికను నింపండి.**

| క్రమ సంఖ్య | అప్పు రకం | అప్పు మొత్తం | తిరిగి చెల్లించే కాలం | కావలసిన పత్రాలు | వడ్డీ శాతం | తిరిగి చెల్లించే విధానం | హామీ, అవసరమైతే విధానం |
|---|---|---|---|---|---|---|---|
| 1 | వాహన రుణం | | | | | | |
| 2 | | | | | | | |
| 3 | | | | | | | |

### కీలక పదాలు

1. వస్తుమార్పిడి
2. డబ్బు రూపాలు
3. జమలు
4. పొదుపు
5. అప్పు/ రుణం
6. వడ్డీ
7. చెక్కు

### మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. కొన్ని లావాదేవీల ఉదాహరణలతో కింది పట్టిక నింపండి.

| రూపాయినోట్లు, నాణాలతో జరిగే లావాదేవీలు | రూపాయలు, నాణాలు లేకుండా జరిగే లావాదేవీలు |
|---|---|
| | |
| | |
| | |

2. బ్యాంకులో డబ్బు పెట్టడం వల్ల ఏమైనా నష్టాలు, సమస్యలు ఉంటాయా? ఆలోచించి రాయండి.
3. మీకు రెండు వేల రూపాయలు అవసరం ఉందనుకోండి. ఒక చెక్కు రాసి మీ చెల్లెలికిచ్చి నగదు తీసుకురమ్మని పంపించండి.
4. డబ్బు మార్పిడిని చెక్కులు ఏవిధంగా సులభతరం చేశాయి?

5. బ్యాంకు తన దగ్గర కొంత డబ్బును మాత్రమే నగదుగా ఉంచుకుంటుంది. ఇలా ఎందుకు జరుగుతుంది? దీని వల్ల బ్యాంకుకు లాభం ఏమిటి?

6. ఖాతాదారులలో చాలామంది బ్యాంకులో డబ్బు ఉంచాలని అనుకోకపోతే అది బ్యాంకు పనితీరును ఏరకంగా ప్రభావితం చేస్తుంది?

7. అప్పులలో చాలా వాటిని మాఫీ చేస్తే (అంటే అప్పు తీసుకున్న వాళ్లు తిరిగి డబ్బు కట్టాల్సిన అవసరం లేదు) అది బ్యాంకు పని తీరును ఏ రకంగా ప్రభావితం చేస్తుంది?

8. ఒక కాలానికి చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్టుపై ప్రజలకు లభించే వడ్డీ కంటే అదే కాలానికి తీసుకున్న అప్పుపై ఎక్కువ వడ్డీ చెల్లించాలి. ఇలా ఎందుకు ఉండాలి?

9. ఈ సంవత్సరం వర్షాలు తక్కువ పడి ఆశించినదాంట్లో వానలు సగమే పడ్డాయని అనుకుందాం. ఇలా జరిగినప్పుడు రైతులు తీసుకున్న అప్పులో సగమే తిరిగి చెల్లించాలని కొంతమంది అంటారు. వచ్చే సంవత్సరం పంటను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న అప్పు మొత్తం తిరిగి చెల్లించాలని కొంతమంది అంటారు. మీ అభిప్రాయం ప్రకారం బ్యాంకులు ఏం చేయాలి? మీ కారణాలు పేర్కొనండి.

10. "అప్పులు రకాలు" శీర్షిక కింద ఉన్న పేరాను చదివి దిగువ ప్రశ్నకు సమాధానం ఇవ్వండి. మీ ప్రాంతంలో తీసుకున్న రుణాల రకాలను పేర్కొనండి.

11. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొందిన సభ్యులకు రుణాలు ఉపయోగకరంగా ఉన్నాయా? ఎలా?

## ప్రాజెక్టు:

1. బ్యాంకుకు వెళ్లండి, లేదా బ్యాంకు అధికారిని మీ బడికి ఆహ్వానించిన ఈ కింది విషయాలు తెలుసుకోండి:

(అ) మీ పేరుతో పొదుపు ఖాతా తెరిచే విధానం

(ఆ) బ్యాంకులు చెక్కుల మొత్తాలను ఎలా చెల్లిస్తాయి?

(ఇ) నెఫ్ట్ (NEFT) బదిలీలను బ్యాంకులు ఎలా చేస్తాయి? (National Electronic Funds Transfer)

(ఈ) ఎటిఎం పని చేయటానికి భద్రతాపరంగా ఎటువంటి జాగ్రత్తలు అవసరం? కంప్యూటరు ఏమి సరి చూస్తుంది?

(ఉ) చెక్కుల ద్వారానే కాకుండా డ్రాఫ్టులు / ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా కూడా డబ్బులు బదిలీ చేయవచ్చు. ఆ వివరాలు తెలుసుకోండి.

(ఊ) డబ్బులు పొందవలసిన వ్యక్తికి చెక్కుతో పోలిస్తే ఆన్‌లైన్ లావాదేవీ వల్ల ప్రయోజనం ఏమిటి?

(ఋ) వివిధ రకాల అప్పులకు వర్తించే వడ్డీ.

| | |
|---|---|
| పొదుపు డిపాజిట్లపై చెల్లించే వడ్డీ | |
| ఫిక్స్‌డ్ డిపాజిట్టుపై చెల్లించే వడ్డీ | |
| రైతులకు ఇచ్చే అప్పులపై వడ్డీ | |
| గృహ రుణాలపై వసూలు చేసే వడ్డీ | |
| విద్యా రుణాలపై వసూలు చేసే వడ్డీ | |

2. www.rbi.org.in లో కామిక్స్, థీమ్స్, ఆర్థిక కార్యకలాపాల కొరకు అంతర్జాలంను సందర్శించండి.



© SCERT not to be republished